క్లుప్తంగా

కానరాని సిగ్నల్ లైట్లు!



ఇండస్ట్రియల్ ఎస్టేట్ కూడలిలో లేని సిగ్నల్‌లైట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57వ వార్డుల పరిధిలోని కంచరపాలెం ప్రధాన రహదారి నుంచి మర్రిపాలెం వెళ్లే మార్గంలో ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల జాడ కనిపించడం లేదు. దీంతో వాహనాల రాకపోకలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. గతంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు తుప్పు పట్టి మూలకు చేరడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొత్తవాటిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి క్షేత్రంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిత్య కల్యాణం జరిపారు. స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

టెన్నిస్‌లో రాగహర్షిణి, పరిణతి విజేతలు

విశాఖ స్పోర్ట్స్: ఆలిండియా సీనియర్ టెన్నిస్ సంఘం (ఐస్టా) ఆధ్వర్యంలో వెటరన్, చిన్నారులకు నిర్వహించిన పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు మాజీ డీజీపీ సాంబశివరావు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై చిన్నారులకు తల్లిదండ్రులు ఆసక్తి కలిగించాలన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు స్థానిక క్లబ్‌ల్లో 35+నుంచి 70+ వరకు ఐదు కేటగిరీలతో పాటు చిన్నారులకు అండర్ 12,14 కేటగిరీలో పోటీలు నిర్వహించారు. అండర్ 12 బాలికల టైటిల్ పోరులో రాగహర్షిణి 8–5 తేడాతో సుదీక్షపై విజయం సాధించింది. అండర్ 14 బాలికల ఫైనల్స్‌లో వి.పరిణతి 8–2తో సేవితపై విజయం సాధించింది. అండర్ 12 బాలుర విభాగంలో రేవంత్ రుషి విజేతగా నిలిచాడు. ఆఫీసర్స్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో టోర్నీ డైరెక్టర్ సతీష్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌చంద్, కార్యదర్శి డీఎస్ఎన్ రాజు, చిన్నారుల టోర్నీ పర్యవేక్షకుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి ప్రాంత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లకే చిట్టిబాబు, గౌరవాధ్యక్షుడిగా గుజ్జెల దేవరాజు, ముఖ్య సలహాదారులుగా శతక చిట్టయ్య, తాంగుల రంగారావు, న్యాయసలహాదారుగా అంబిడి రాజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అడపా తిరుపతివెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా దీసరి భాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రొబ్బ వెంకటరావు, కోశాధికారిగా శెట్టి జయదాస్, 35 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు కొక్కుల రామారావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. పెందుర్తి ప్రాంతంలో నివాసం ఉంటున్న దాదాపు 500 మంది గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తీర్మానం చేశారు.

ఉత్సాహంగా నడక పోటీలు

మురళీనగర్ : వాకర్స్ క్లబ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నడక పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను 41–50, 51–60, 61–70, 70 ఆపైన వయసు కలిగిన పురుషులు, మహిళలకు నిర్వహించారు. పోటీల్లో 93 మంది పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 4న నిర్వహించే వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తారు.

గ్రామ కంఠంపై కన్ను!



గ్రామకంఠంలో నిర్వహిస్తున్న మార్కెట్

- ఆ స్థలం జీవీఎంసీకి అప్పగించే యత్నాలు
- మండిపడుతున్న వ్యాపారులు, కుల సంఘాల నాయకులు
- ఉత్సవాలు ఎక్కడ నిర్వహించుకోవాలని ఆగ్రహం

మల్కాపురం: గ్రామస్తుల అవసరాలు.. ఉత్సవాల నిర్వహణ కోసం కేటాయించిన స్థలంపై కొందరి రాజకీయ నాయకుల కన్నుపడింది. ఆ స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి లబ్ధిపొందాలని పావులు కదుపుతున్నారు. దీనిపై గ్రామస్తులతో పాటు కుల సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మల్కాపురం మధ్యలో విలువైన మార్కెట్ స్థలం ఇదే

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామంలో సుమారు 16 కుల సంఘాలు ఉన్నాయి.సుమారు 13 వేల మంది జనాభా నివసిస్తున్నారు. అయితే వందేళ్ల కిందట మల్కాపురం గ్రామం ఏర్పడినప్పుడే నాటి అధికారులు గ్రామ అభివృద్ధి కోసం, అమ్మవార్ల ఉత్సవాలు నిర్వహించుకునేందుకు కొంత స్థలం కేటాయించారు. అయితే ఆ విలువైన స్థలం కొంత ఆక్రమణ పాలైంది. అది పోనూ మల్కాపురం మధ్యలో అమ్మవారు ఉత్సవాలు నిర్వహించే స్థలం సుమారు ఎకరం పైగా ఉంది. ఆ స్థలంలో తాత్కాలికంగా కొంత మంది కూరగాయాలు, ఇతర దుకాణాలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అమ్మవార్ల ఉత్సవాల సమయంలో వ్యాపారాలను మూసి వేసి గ్రామ అభివృద్ధి కమిటీకి ఆ స్థలాన్ని అప్పగిస్తారు. ఉత్సవాల అనంతరం మరలా తమ తమ వ్యాపారాలు సాగిస్తుంటారు.

కట్ చేస్తే...

ఇంత వరకు బాగానే ఉన్నా ఈ విలువైన స్థలంపై కొంత మంది నాయకుల కన్ను పడింది. దీనిని జీవీఎంసీకి అప్పగించి షాపులు నిర్మించిన తర్వాత చేజిక్కించుకోవడానికి యత్నం చేస్తున్నారు. ఊరు మధ్య విలువైన స్థలం కావడంతో ఇక్కడ వ్యాపారాలు బాగానే సాగుతాయన్న ఆలోచనతో స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే జరిగితే మూడేళ్లకు ఒక్క సారి నిర్వహించే గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించుకునేందుకు స్థలం ఉండదని మండిపడుతున్నారు. మార్కెట్ స్థలానికి జీవీఎంసీకి ఇస్తే ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు.

విలువైన స్థలాన్ని కాపాడుకుంటాం



విలువైన గ్రామకంఠం స్థలంపై కొంత మంది కన్ను పడింది. దీంతో వారు ఆ స్థలాన్ని ఇతరులకు అప్పగించే యత్నాలు చేస్తున్నట్టు సమాచారం అందుతుంది. గ్రామంలో అన్ని కులాల సభ్యులు దీనిని వ్యతిరేకిస్తున్నారు. విలువైన గ్రామ స్థలాన్ని మేమంతా కలిసి కాపాడుకుంటాం. – నూకరాజు, శెట్టిబలిజవీధి,మల్కాపురం

ఆ స్థలం అలాగే ఉంచాలి



మల్కాపురం మధ్యలో ఉన్న గ్రామకంతం అమ్మవార్ల ఉత్సవాల కోసం ఉంచాలి. దానిలో నిర్మాణాలు చేస్తే ఉత్సవాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు తప్పవు. గ్రామానికి సంబంధించిన విలువైన స్థలాన్ని పోగొట్టుకున్న వారిమి అవుతాం.అలాంటి ప్రతిపాదనలు విరమించుకోవాలి.
–కాకర ప్రకాష్‌రావు, హరిజనవీధి,మల్కాపురం

నాయకులు ఆలోచన చేయాలి



విలువైన గ్రామకంఠ స్థలాన్ని గ్రామ పెద్దలు స్వాధీనంలో ఉండాలి. దానిలో గ్రామకంతం వారే సొంతంగా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి, దాని ద్వారా వచ్చే ఆదాయం అమ్మవార్ల ఉత్సవాలకు ఉపయోగిస్తే మంచిది. దీనిపై పాలకులు ఆలోచన చేయాలి.
– పంచదార్ల అప్పలరాజుయాదవ్, గొల్లవీధి,మల్కాపురం

350 మందికి వైద్య పరీక్షలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో కోరమాండల్ సంస్థ సౌజన్యంతో ఆదివారం సామాజిక భవనం వద్ద నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కోరమాండల్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్)రెడ్డిపల్లి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచనతో సీఎస్ఆర్ నిధులతో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. చిన్న పిల్లలు,స్త్రీలకు,దంత,ఆర్థో వైద్య నిపుణులు సుమారు 350 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరమాండల్ అధికారులు కె.శ్రీకాంత్,ఎస్.వెంకటరమణ,చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి తెలుగు సినిమా ఫిల్మ్ ఫెస్టివల్

మద్దిలపాలెం: తెలుగు సినిమా ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఈనెల 5 నుంచి 7 వరకూ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి ప్రకాశరావు తెలిపారు. భక్త ప్రహ్లాద (తొలి పూర్తి నిడివి చిత్రం) ఫిబ్రవరి 6న విడుదలైన సందర్భంగా తెలుగు సినిమా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఫెస్టివల్‌కు అధ్యక్షుడిగా కాశీవిశ్వేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు.

విద్యతోనే ఉన్నతి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెల్లి కుల సంక్షేమ సంఘ సభ్యులు

సింథియా: విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ రెల్లి కుల అభివృద్ధి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొట్నాన రవి అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలోని ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ భవనంలో ఆదివారం రెల్లి కులస్తులకు విద్యా సదస్సు నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడేరు తహసీల్దార్ కోన సింహగిరి విద్యార్థులకు పలు విషయాలను వివరించారు. చదువుపై శ్రద్ధపెట్టాలని సూచించారు. అనంతరం బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కోన ప్రసన్న కుమార్ చేతులమీదుగా సుమారు 150 మందికి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. రెల్లి కుల మేధావులు యువతకు సరైన మార్గాలు చూపాలని డాక్టర్ ఆకుల మహేష్ కోరారు. కార్యక్రమం నాయకులు పిన్నింటి జనార్దన్, కెల్లా మురళీ, సింహాచలం , లోకొండ అప్పారావు, మరియదాసు, వడ్డాది శివ, రౌతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ అనర్థాలపై అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: ప్లాస్టిక్ వల్ల అనర్థాలను దృష్టిలో పెట్టుకుని వినియోగంపై అధికారులు నిషేధం విధించారని జేడీ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. సీతారామ రాజునగర్ కాలనీ పార్క్‌లో ఆదివారం ప్లాస్టిక్ అనర్థాలపై ఫౌండేషన్ సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్క్‌లో చిన్నారులు, పెద్దలకు ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. గుడ్డ సంచులే వాడాలని.. ప్లాస్టిక్ సంచులు వాడొద్దని నినాదాలు చేశారు. కోరమాండల్ సంస్థ సమకూర్చిన గుడ్డ సంచులను పంపిణీ చేశారు.

భవిష్యత్తు సోలార్ పవర్‌దే

ఎంపీ గొల్ల బాబూరావు



సోలార్ పవర్ ప్యానెల్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు

గాజువాక: భవిష్యత్‌లో సోలార్ పవర్ కీలకంగా మారుతుందని రాజ్యసభ సభ్యుడు, సోలార్ పవర్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్ది శంకర్‌రెడ్డి తన ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసిన 5కేవీ సోలార్ పవర్ సిస్టమ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇంటి కప్పుపై అమర్చుతామన్నారు. ఇతరులు ఈ పవర్‌ను ఏర్పాటు చేసుకుంటే రూ.78వేలు సబ్సిడీ ఇస్తారన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి, చెంగల వెంకటరావు, నాయకులు రవిరాజ్, గుడివాడ లతీష్ , మంత్రి రాజశేఖర్, బాష తదితరులు పాల్గొన్నారు.

ధూమ్‌ధామ్‌గా గాజువాక ఉత్సవ్



గాజువాక ఉత్సవ్‌లో జనం రద్దీ

గాజువాక: సీతారామ ఉమారామలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం (గాజువాక ఉత్సవ్) ఆదివారం వైభవంగా జరిగింది. ఆటలు, పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గాజువాక బీసీ రోడ్డులో సందడి నెలకొంది. ఉత్సవాల సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, మహ్మద్ ఇమ్రాన్, ఉత్సవ కమిటీ సభ్యులు మద్ది శంకర్‌రెడ్డి, దొడ్డి రమణ, గోమాడ వాసు, గుణ శ్రీను, ఎలమంచిలి పైడిరాజు, పొలమరశెట్టి వాసు, పిట్ట ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు గాజువాక వాసులకు కనువిందు చేశాయి.



గాజువాక ఉత్సవ్‌లో స్టాళ్లవద్ద రద్దీ

ధ్యానం నిత్య జీవనంలో భాగం కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న నరేంద్ర, మాస్టర్లు

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని హైదరాబాద్‌కు చెందిన ధ్యాన గ్రాండ్ మాస్టర్ నరేంద్ర మొదల్కర్ అన్నారు. శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం 'ధ్యాని, విజ్ఞాని' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యానం అవసరం అన్నారు. ధ్యానం ఒత్తిడిని జయించేలా చేస్తుందన్నారు. సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఎలా జీవించాలో వివరించారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, నిరంతర జీవన ప్రక్రియలో ధ్యానం ఎంతో అవసరం అన్నారు. ధ్యాన కేంద్ర నిర్వాహకులు, పలువురు ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

రేపు సింహగిరిపై రథసప్తమి వేడుకలు



సింహగిరి ఆలయ ప్రాంగణంలో హంసమూలన ఉన్న రాతి రథం

సింహాచలం: సింహగిరిపై మంగళవారం రథసప్తమి వేడుకల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించేందుకు దేవస్థానం అధికార, వైదికులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో హంసమూలన స్వామివారు ఉభయ దేవేరులతో దర్శనమివ్వనున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఉదయం రాతిరథంపై అధిష్టింపజేసి అభిషేకాలు, అరుణ పారాయణం, విశేష పూజలు జరుపుతారు. అనంతరం 9.30 నుంచి రాతిరథం పైనే నిత్యకల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి సింహగిరి మాడ వీధిలో సూర్యప్రభ వాహనంపై తిరువీధి జరగనుంది.

శ్రీకృష్ణాపురంలోని గోశాలలో.. సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీ కృష్ణాపురంలోని గోశాలలో ఉన్న భారీ సప్తవాహన ఏక చక్ర రథసారథి సమేత సూర్యనారాయణస్వామి చెంతన మంగళవారం ఉదయం 8 గంటల నుంచి విశేషంగా పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. స్వామివారి సన్నిధిలో పంచామృతాభిషేకాలు, అరుణ హోమం, అరుణ పారాయణం, సూర్యనమస్కారాల కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

పైడిమాంబ పండగను విజయవంతం చేద్దాం



సమావేశమైన గ్రామ పెద్దలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండగను ఈ నెల 11న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ, బుచ్చిరాజుపాలెం గ్రామ ప్రజలు సంయుక్తంగా పండగ నిర్వహిస్తున్న నేపథ్యంలో విజయవంతం అయ్యేలా సహకరించాలని ఆలయ ఈవో సత్యనారాయణ మూర్తి, మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద గ్రామ పెద్దలు సమావేశమై పండగ ఏర్పాట్లపై చర్చించారు. పలు సూచన సలహాలు చేశారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి రెండో మంగళవారం పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రధాన పండగకు దేవస్థానం తరపున విద్యుత్ దీపాలంకరణ, తాగునీరు, ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం స్టేజ్ ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ పెద్దలు, దాతలు మరో రెండు స్టేజీలు ఏర్పాటు చేస్తున్నారు.

ఆలయాన్ని పట్టించుకోని దేవదాయశాఖ

పైడిమాంబ అమ్మవారి ఆలయం దేవస్థానం ఆధీనంలోనికి వెళ్లి 10 సంవత్సరాలైనప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు అన్నారు. పండగ సమయంలో తప్పా దేవాలయాన్ని పట్టించుకున్న దాఖలు లేవన్నారు. గతంలో జరిగిన పొరపాట్ల వల్ల దేవస్థానం పరిధిలోకి వెళ్లిందన్నారు. తిరిగి గ్రామానికి అప్పగించేలా గ్రామాభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో తగిన కార్యాచరణతో ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పురెడ్డి ప్రకాష్ రెడ్డి, త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు ఎలమంచిలి చంద్రరావు, ఉపాధ్యక్షులు మళ్ల కనకరాజు, మళ్ల రామారావు, పురెడ్డి పైడిరెడ్డి, నూకరెడ్డి, గురురామరెడ్డి, చక్రవర్తి రెడ్డి, కిషోర్ రెడ్డి, దొడ్డి సతీష్, దొడ్డి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి



తీర్థమహోత్సవంలో స్టాళ్ల వద్ద కొనుగోలు దారులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవత బంగారు మాంబ తీర్థ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్ రాజ్, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్, వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, నాయకులు జీలకర్ర నాగేంద్ర, బోగాది అప్పారావు, విరోతి రాము, సాలాపు వెంకట్రావు, కృష్ణంరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

సందడే సందడి

తీర్థమహోత్సవంలో పలు స్టాళ్లు కొలువు తీరాయి. కొనుగోలు దారులతో సందడి నెలకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు గోపిశెట్టి శ్రీనివాసరావు, పల్లెల శ్రీనివాసరావు, గవర వెంకటరమణారావు, గండ్రెడ్డి ప్రకాష్‌రావు, సంద్రాన శ్రీనివాసరావు, గోపిశెట్టి వెంకటరావు, గోపిశెట్టి సోమునాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణ ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు.

సందడిగా ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1990–91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొంటూ సందడిగా గడిపారు. 34 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న వారవతా కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని దాని ద్వారా తమ మిత్రుల కష్ట సుఖాలను తెలుసుకొంటున్నామని, అవసరమైనవారికి సహాయపడుతున్నామని చెప్పారు. అనంతరం హౌసీ, కబడ్డీ, మ్యూజికల్ చైర్ వంటి ఆటలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు కరణంరెడ్డి నర్సింగరావు, నర్సింగ్, చట్టి గోపి, బాలా కుమార్, మోహన్, కృష్ణారెడ్డి, నూకరాజు, శంకర్, కృష్ణ, సతీష్, రబ్బాని, ఫాతిమా, లక్ష్మి, తిరుపతి, శ్రీను, శైలజ పాల్గొన్నారు.